క్లుప్తంగా

రజత పథకం సాధించిన నర్సాపూర్ క్రీడాకారిణి



రాష్ట్ర స్థాయి పోటీల్లో సాధించిన రజత పతకంతో క్రీడాకారిణి శ్రామిక

నర్సాపూర్: రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఉషు పోటీల్లో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన నర్సాపూర్‌కు చెందిన క్రీడాకారిణి రజత పతకం సాధించిందని పీడీ పూర్ణచందర్ తెలిపారు. ఈనెల 26 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో సీఎం కప్ పోటీలు జరిగాయని చెప్పారు. నర్సాపూర్‌కు చెందిన బి.శ్రామిక 56 విభాగంలో ఉషు పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించిందని ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలి



శివాయిపల్లిలో సివిల్‌రైట్స్‌డేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలందరూ కుల మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని తహసీల్దార్ గ్రేస్‌బాయ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని శివాయపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు కలిసిమెలిసి ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ప్రస్తుత సమాజంలో అందరూ ఒకటేనని ఎవర్నీ దూషించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, హెడ్ కానిస్టేబుల్ విఠల్, నాయకులు కిష్టయ్య తదితరులు ఉన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సోమవారం దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి, ఆర్ఐ ఇమామ్, మహమ్మద్ గౌస్, లక్ష్మణ్‌గౌడ్, అంజాగౌడ్, భూమయ్య, పోచయ్య, స్వప్న, సయ్యద్, అంజాగౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భగీరథ పైప్‌లైన్ ధ్వంసం



పైప్‌లైన్ ధ్వంసం కావడంతో ఏర్పడిన గుంత

నర్సాపూర్ రూరల్: మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండలంలోని నత్నయపల్లి వడ్డెర కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నత్నాయపల్లి నుంచి వడ్డెర కాలనీకి తాగునీటిని పైప్‌లైన్ ధ్వంసం కావడంతో కొన్ని రోజులుగా తాగునీటి కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే మిషన్ భగీరథ మరమ్మతులు చెప్పకుండా పైప్‌లైన్‌కు ఉన్న చెక్ వాల్స్‌ను ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పైప్‌లైన్ మరమ్మతులు చేసినీటి సరఫరా చేయాలని కోరడంతో పాటు చెక్‌వాల్స్ తీసుకెళ్లడంపై అధికారులను గ్రామస్తులు నిలతీయగా, ఇతర ప్రదేశాల్లో మరమ్మతుల కోసం చెక్‌వాల్స్ తీసుకెళ్తున్నట్లు దురుసుగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ రాజకుమార్‌ను వివరణ కోరగా.. ఇతర ప్రదేశాల్లో చెక్ వాల్వు చెడిపోవడంతో వీటిని తీసుకెళ్లి అక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొత్తవి రాగానే ఇక్కడ బిగిస్తామని చెప్పారు.

అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతిలోని అంగన్‌వాడీ-1 భవనం కిటికీలు, తలుపులు శిథిలావస్థకు చేరాయి. గ్రామానికి చెందిన బవనగారి శ్రీనివాస్ స్పందించి, తన సొంత నిధులతో తలుపులకు మరమ్మతులు చేయించడంతో పాటు కొత్త కిటికీలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాడు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు అతనికి కృతజ్ఞతలు తెలిపారు.

లోవోల్టేజ్ విద్యుత్‌తో ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో పలు కాలనీల్లో వోల్టేజ్ విద్యుత్ సరఫరా అవుతుంది. ఉదయం వేళల్లో లో - ఓల్టేజ్‌తో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని పలు కాలనీవాసులు ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయం గురించి లైన్‌మెన్ సురేశ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఉదయం వేళల్లో అందరు ఒకేసారి గ్రీజర్లు, హీటర్లు, మోటార్లు వినియోగిస్తుండడం వల్ల సమస్య తలెత్తుతుందని చెప్పారు.

వామ్మో.. కోతులు, కుక్కలు

- భయందోళనలో ప్రజలు
- కళ్లప్పగించి చూస్తున్న అధికారులు

నర్సాపూర్: మున్సిపల్ పట్టణ ప్రజలు కోతులు, కుక్కలతో బెంబేలు చెందుతున్నారు. రోజు వాటి బారిన పడి గాయాలవుతూ.. కాళ్లు, చేతులు విరగడం లాంటి ఘటనలు సర్వసాధారణంగా మారింది. పట్టణంలో పది వేలకు పైనే కోతులు ఉండగా, కుక్కలు రెండు వేల వరకు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టణంలో ఎక్కడ చూసినా కోతులు కన్పిస్తుంటాయి. కోతులు, కుక్కల సంఖ్య భారీగా పెరగడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చేతిలో చిన్న పాటి కవరు పట్టుకొని బయటకు వెళ్లాలన్న, పిల్లలు బయట ఆడుకోవాలన్న భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కోతులు, కుక్కలు ఏ పక్క నుంచి వచ్చి కరుస్తాయె తెలియని దుస్థితి నెలకొంది. దుకాణాల నుంచి ఏమైనా సరుకులు కొనుగోలు చేసి, చేతిలో కవరు పట్టుకొని వెళ్లడం కష్టంగా మారింది. కోతులు వచ్చి కవర్లను ఎత్తుకొని పారిపోతుంటాయి. ఒక్కోసారి కవరు పట్టుకొని వెళ్లే వారిని కరిచి కవర్లను ఎత్తుకుపోయిన ఘటనలు ఉన్నాయి. చిన్న పిల్లలు ఇళ్ల బయట ఆడుకోవాలంటే భయాందోళన చెందుతున్నారు. కోతులు, కుక్కలు వచ్చి కరుస్తున్నాయని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



నర్సాపూర్ కాలనీల్లో కుక్కలు

రోజుకు 15 నుంచి 20 మంది..

కోతులు, కుక్కల కాటుకు రోజుకు 15 నుంచి 20 మంది గాయాల పాలవుతున్నారు. కుక్క కాటుకు చేసే వైద్యమే కోతి కాటుకు చేస్తారు. గాయాల పాలైన వ్యక్తులు మూడు నెలల పాటు వైద్యం పొందాల్సి ఉంటుంది. కోతి కుక్కల కాటుకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం అందుతున్నప్పటికి రెండు, మూడు నెలల పాటు వాటి బారిన పడిన వ్యక్తులు ఇబ్బందుల పాలవుతున్నారు. కోతుల దాడిలో, కోతులు వస్తున్నాయన్న ఆందోళనలో మెట్లపై నుంచి ఆదరా బాదరా దిగాలన్న ప్రయత్నంలో ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. పట్టణంలోని ఓ మహిళ ఇంటి ఎదుట ముగ్గు వేస్తుండగా కోతులు రావడంతో పక్కకు జరగడానికి ప్రయత్నించి ప్రమాదానికి గురై కింద పడగా, కాలు విరిగి సుమారు ఆరు నెలలుగా కదల లేని స్థితిలో ఉంది. పట్టణంలోని 12 వ వార్డుకు చెందిన నాలుగేళ్ల చిన్నారి కుమ్మరి వీరౌనిక తమ ఇంటి ఎదుట ఆడుకుట్టుండగా కుక్కలు వచ్చి చెవి పక్కన కరిచాయి. చిన్నారికి తీవ్రమైన గాయం కావడంతో ఆమె తల్లిదండ్రులు వారం రోజుల నుంచి వైద్యం చేయిస్తున్నారు.

ఇంజెక్షన్ తీసుకోవాలి



కోతులు, కుక్కలు కరిచాయని పగటి పూటతో పాటు రాత్రి పూట 11 గంటల వరకు బాధితులు ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వస్తున్నారు. వాటి బారిన పడిన వారు రోజుకు 15 నుంచి 20 మంది వస్తున్నారు. అందరూ నిర్ణీత సమయంలో ఇంజెక్షన్ తీసుకోవాలి. కోతులు, కుక్కలు కరిచినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా, సరైన వైద్యం చేయించుకోవాలి.

– డాక్టర్ మీర్జా నజీంబేగ్

పనులు చేపడతాం



మెదక్‌లో ఎనిమల్ బర్త్ కంట్రోలు సెంటరు భవనం నిర్మాణ పనులు పూర్తి చేశాం. సెంటరు వినియోగంలోకి రాగానే పట్టణంలో కోతులు కుక్కలు పట్టి అక్కడికి పంపించే పనులు చేపడుతాం. వచ్చే నెలలో వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. సెంటరులో వాటికి నిబంధనల మేరకు పిల్లలు పుట్టకుండా సర్జరీ చేసి పంపిస్తాం. దీంతో వాటి సంఖ్య పెరగదు.

– మున్సిపల్ కమిషనర్ రామకృష్ణరావు

ఆలయంలో అమావాస్య పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



హోమం నిర్వహిస్తున్న పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠం ఆలయంలో అమావాస్య సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో హారిద్వార్చన, విశేష పూజలు, హోమం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తూప్రాన్‌కు చెందిన వ్యాపారి పెద్దిగారి రామచంద్రయ్య భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ భూదాత రమేశ్‌గుప్తా, నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, సూర్యకుమార్‌గౌడ్, లక్ష్మీనర్సయ్య, భిక్షపతి, పోచగౌడ్, అశోక్, తదితరులు ఉన్నారు.

సర్వేను త్వరగా పూర్తి చేయండి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండలంలోని తునికి, ధర్మాసాగర్, కూకుట్లపల్లి, దేవులపల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 10,287 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు యాభైశాతం సర్వేపూర్తి అయిందన్నారు. సర్వేను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సర్వేకు గ్రామస్తులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వెంకటేశం, సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

ట్రాక్టర్‌తో ఉడాయించి..



రెడ్డిపల్లి శివారులో దొంగలు వదిలి వెళ్లిన గ్రామపంచాయతీ ట్రాక్టర్

చేగుంట(తూప్రాన్): గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను అపహరించిన గుర్తుతెలియని వ్యక్తులు రెడ్డిపల్లి శివారులో వదిలేసిన ఘటన చేగుంటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్‌ను ఆదివారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో పార్కింగ్ చేసి ఉంచగా, రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను అపహరించారు. గ్రామ పంచయతీ సిబ్బంది ఉదయం పంచాయతీ కార్యాలయానికి చేరుకొని ట్రాక్టర్ లేకపోవడం గమనించి పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కు సమాచారం అందించారు. పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ కోసం వెతకగా.. రెడ్డిపల్లి శివారులోని రుక్మాపూర్ దారిలో ట్రాక్టర్‌ను గుర్తించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆయా పాఠశాలలకు విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ..విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ఉన్నత లక్ష్యం ఏర్పర్చుకొని కష్టపడి చదవాలని సూచించారు.



అల్లాదుర్గం(మెదక్): విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు



వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



శివ్వంపేట ఉన్నత పాఠశాలలో..



మనోహరాబాద్‌లో..



పాపన్నపేటలో విజేతలతో టీచర్లు



కౌడిపల్లిలో..



చిన్నశంకరంపేట(మెదక్): విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ పుష్పవేణి



టేక్మాల్(మెదక్): విజేతలకు బహుమతులను అందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సిబ్బంది కృషి చేయాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను సీఐ రంగాకృష్ణతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, పీఎస్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలు నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. దాతల సహకారంతో గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించాలన్నారు. దొంగతనాల నివారణకు రాత్రి పెట్రోలింగ్ వ్యవస్థ పటిష్టంగా అమలు చేయాలని, పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

కరెంట్ సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్: పట్టణంలో కరెంట్ శాఖకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్ సోమవారం విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో పలు కరెంట్ స్తంభాలు మార్పు చేయాలని, వదులుగా ఉన్న కరెంట్ తీగలను సరిచేయాలని తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయానని ఆయన చెప్పారు. ఏడీఈ సాను కూలంగా స్పందించారని ఆయా పనులను త్వరలో పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారని నవీన్ కుమార్ తెలిపారు.

రాంరెడ్డి కుంట ఆక్రమణ అరికట్టండి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఏదులపల్లి గ్రామ శివారులో ఆక్రమణకు గురవుతున్న రాంరెడ్డి కుంటను రక్షించాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నం. 95లో సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన రాంరెడ్డి కుంట నేడు చుట్టుపక్క రైతుల ఆక్రమణలతో మొత్తం కుచించుకుపోయిందన్నారు. అదేవిధంగా పానాది కూడా ఆక్రమణకు గురైందన్నారు. ఈ విషయంలో అధికారులు విచారణ చేపట్టి కుంట, పానాదికి హద్దులు నిర్ణయించాలని కోరారు. లేనిపక్షంలో ఆయకట్టు రైతుల పక్షాన ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గౌరి, నరేందర్, కుమార్, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణానంద స్వామి ఆరాధన ఉత్సవాలు

- నామస్మరణతో మార్మోగిన రంగంపేట ఆశ్రమం



విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న సంస్కృత పండితుడు ప్రభాకర్ శర్మ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలోని గురు మధనానంద స్వామి ఆశ్రమం దత్త నామస్మరణతో మార్మోగింది. ఆశ్రమంలో మూడు రోజుల నుంచి కృష్ణానంద సరస్వతి స్వామి ఆరాధనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగియి. ఇందులో భాగంగా చివరి రోజైన సోమవారం ఆశ్రమ పూర్వ శిష్యులతో దర్బార్‌ను నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శిష్యులు తమ గాన గంధర్వులతో పద్యాలు, పాటలు, ప్రవచనాలతో భక్తులను భక్తి పారవశ్యంలోకి తీసుకెళ్లారు. అనంతరం మాధవానంద స్వామి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి ప్రేమతత్వాన్ని పెంచాల్సిన అవసరం సమాజానికి అవసరమన్నారు. ఇప్పుడే లోకం శాంతి సౌఖ్యాలతో వెలుగొందుతారన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపు ఉండాలి

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు ఆశ్రమం ఆధ్వర్యంలో మండలంలోని విద్యార్థులకు పద్య పఠనం, భాగవత, రామాయణ ఇతిహాసాలకు సంబంధించి పోటీ పరీక్షలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నాచారం పీఠాధిపతి మధుసూదనంద స్వామి, ప్రముఖ సంస్కృత పండితుడు ప్రభాకర్ శర్మ, ఎంఈఓ, సత్యనారాయణ రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రభులింగం చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు.

కూల్చివేతలు అడ్డగింత

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం రామునిపల్లి గ్రామ చెర్వు శిఖం భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను కూల్చివేసే పనులను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. కొందరు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ అధికారి శ్రీనివాస్‌తో పాటు ఆర్ఐ సత్యనారాయణలు జేసీబీతో వెళ్లారు. నిర్మాణాలకు అనుమతులు చూపాలని అడుగగా అధికారులతో వాగ్వాదానికి దిగారు.

సంక్షిప్త వార్తలు

◆ పరామర్శ

నర్సాపూర్: కొల్చారంలో పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సాయికుమార్ ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. దీంతో ఆ బాధిత కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు. సోమవారం ఎమ్మెల్యే ఆయన భౌతిక కాయంపై పూలమాలతో నివాళులర్పించారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెం గ్రామానికి చెందిన ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్ మాట్లాడారు. బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు స్వామి, నాయకులు నర్సింలు, వెంకటేష్, తదితరులున్నారు.

◆ మూతబడిన ఏటీఎం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతిలోని యూనియన్ బ్యాంకు (ఆంధ్రా బ్యాంకు) ఏటీఎం సెంటర్ మూతపడడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూప్రాన్- నర్సాపూర్ హైవే దొంతి బస్టాండ్ సమీపంలోని బ్యాంకు ఎదుట ఏర్పాటు చేసిన ఏటీఎం సంవత్సరం నుంచి మూతపడింది. దీంతో డబ్బుల కోసం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయం గురించి బ్యాంకు మేనేజర్ అమృత వివరణ కోరగా.. ఏటీఎంలో రెండుసార్లు చోరీ సంఘటనలు చోటు చేసుకోవడంతో హైరిస్కు ఏటీఎంగా ముద్ర పడిందని, ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించామని అనుమతులు రాగానే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

◆ పోలీస్‌స్టేషన్ తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకట్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర వివరాల రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

రామాయంపేట(మెదక్): మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రామాయంపేటలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయ్, సభ్యులు నారాయణ, రాంచంద్రం, వెంకటి, రామరాజు, పాల్గొన్నారు.

◆ పనుల్లో నాణ్యత పాటించాలి



తూప్రాన్: సీసీరోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ జ్యోతికృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భగవాన్ రెడ్డి, కృష్ణ, రఘుపతి, రవీందర్‌గుప్తా, నర్సోజి తదితరులు పాల్గొన్నారు.

◆ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తాం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో 31న రాత్రి డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు బండ్లు ఇచ్చిన పెద్దలపై కేసులు పెట్టనున్నట్లు తెలిపారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా అనమతి పొందాలని సూచించారు. అలాగే ప్రజలకు ఇబ్బంది కలిగించేలా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేసినా.. అధిక శబ్దం వచ్చేలా బాక్స్‌లు ఏర్పాటు చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ ఆలయంలో పూజలు

నర్సాపూర్: అమావాస్యను పురస్కరించుకొని సోమవారం బస్టాండ్ హనుమాన్ ఆలయంలో ఆలయ అర్చకుడు హరిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు వ్యాపారి స్వప్న వెంకటేశ్‌గౌడ్‌ల దంపతులు అన్న ప్రసాదం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

◆ ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి



శివ్వంపేట(నర్సాపూర్): రైతులు సాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో తునికి కృషి విజ్ఞాన కేంద్రం, మల్లారెడ్డి అగ్రికల్చర్ కాలేజీ విద్యార్థుల భాగస్వామ్యంతో రైతులకు సాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. గ్రామ ముఖచిత్రం వేసి గ్రామాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన ప్రణాళికలను వివరించారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతతో ప్రజాసమస్యల పరిష్కారం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాలేజీ విద్యార్థులు స్నేహ, శిరీష, శైలజ, సింధు, శృతి, రైతులు పాల్గొన్నారు.